# పగటి దొంగలు



కొండవీడులో గోపయ్య ప్రముఖ వ్యాపారి.

ఒక రోజు గోపయ్య చిలకలపాడు గ్రామంలో ధాన్యం కొని బండ్ల మీద ఎత్తించి తీసుకు వస్తున్నాడు. పట్టపగలే మార్గమధ్యంలో దొంగలు చుట్టుముట్టారు. గోపయ్యకు వాళ్ళను చూడటం తోనే చెమటలు పట్టాయి. కాళ్ళు చేతులు వణికాయి. భయంతో నిలువు గుడ్లు పడ్డాయి. రాత్రిళ్ళు దొంగలు దోచుకుంటారని అనేకమంది చెప్పగా విన్నాడు. అందుకే అతను పట్టపగలే ప్రయాణం చేయడం అలవాటు చేసుకున్నాడు. ఇప్పుడు పట్టపగలే దొంగలు ఎదురవడంతో బిత్తర పోయాడు. పగటి దొంగలు కత్తులు చూపించి గోపయ్యను, అతని అనుచరుల్ని భయ భ్రాంతుల్ని చేసి ధాన్యం బస్తాలు, బళ్ళతో సహా తోలుకుపోయారు. దొంగలు ధాన్యం మాత్రమే దోచుకున్నందుకు తనకు ఏమీ హాని తలపెట్ట నందుకు సంతోషించి 'బతుకు జీవుడా' అని బైట పడ్డాడు.

అప్పుడు కొండవీడుని పరిపాలిస్తున్న రాజు వేమారెడ్డిని సభలో కలుసుకుని తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు గోపయ్య.

"మహారాజా! పట్టపగలే దొంగలు దోచు కోవడం కనీవినీ ఎరుగను. రాజ్యంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఇలా దోపిడీలు జరుగు తుంటే వ్యాపారాలు చేయడం మా వల్లకాదు ప్రభూ!"

"ఏమిటీ పట్టపగలే దొంగలు దోచుకున్నారా? అని ఆశ్చర్యపోయాడు రాజుగారు.

"అవును ప్రభూ! వాళ్ళు గుండెలు తీసిన బంట్లు. మొహాలకు ముసుగులు గూడా వేసు కోలేదు. అంతా యువకులే. గుర్రాల మీద వచ్చి కత్తులతో బెదిరించి ధాన్యం బండ్లతో సహా తోలుకుపోయారు." వివరంగా చెప్పాడు గోపయ్య.

"అలాగా! అయితే వాళ్ళను మళ్ళీ చూస్తే గుర్తు పట్టగలవన్న మాట."

"తప్పకుండా గుర్తు పడతాను ప్రభూ!"

"అయితే నువ్వు అప్రమత్తంగా వుండు. ఆ పగటి దొంగలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే

కొత్వాలుకి తెలియజెయ్యి. వాళ్ళకి తగిన శిక్ష విధిస్తాను'' అన్నాడు రాజు.

"చిత్తం ప్రభూ!" అని వెళ్ళిపోయాడు గోపయ్య.

అతనికి లోలోపల అసంతృప్తి కలిగింది. రాజుకి ఫిర్యాదు చేస్తే దారిదోపిడీ నివారణకు రాజమార్గాలలో రక్షక భటుల్ని కాపలా పెడతాడనీ, సంచార దళాల్ని ఏర్పాటు చేస్తాడనీ ముందు ముందు దారి దోపిడీల్ని అరికడతాడనీ అనుకుంటే అదేమీ అనకపోగా తను దొంగల్ని గుర్తుపడితే శిక్ష విధిస్తాడట అనుకున్నాడు. దొంగలు ఏమైనా పిచ్చివాళ్ళా మళ్ళీ తన కంట పడడానికి అని నీరస పడ్డాడు. దొంగలు దొరుకుతారనీ వాళ్ళకి శిక్షపడుతుందనే నమ్మకం లేదు అతనికి.

అయితే ఆశ్చర్యంగా పగటి దొంగల ముఠా నాయకుడు కొండవీడులోనే గోపయ్య కంట పడ్డాడు. విఫణి వీధిలో మామిడి పళ్ళు కొంటున్న దొంగని గోపయ్య గుర్తించి తన నౌకర్ని కొత్వాలు దగ్గరికి పంపించాడు. కొత్వాలు ఆగ మేఘాల మీద రక్షక భటులతో తరలి వచ్చి దొంగల ముఠా నాయకుడిని బంధించాడు.

మర్నాడు దొంగని సభలో హాజరు పరుస్తారనీ గోపయ్యని గూడా వచ్చి సాక్ష్యం చెప్పమనీ రాజు గారి నుంచీ వర్తమానం అందింది.

పట్టపగలే దోచుకున్న దొంగల నాయకుడు దొరికాడనీ విచారణ జరుగుతున్నదనీ తెలిసిన పట్టణ ప్రజలు కుతూహలంతో పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు.

మహారాజు వేమారెడ్డి స్వయంగా విచారణ ప్రారంభించాడు.

"నీ పేరేమిటి?" ప్రశ్నించాడు రాజు.

"నా పేరు రవివర్మ మహాప్రభూ!" చెప్పాడు దొంగల నాయకుడు.

"చిలకలపాడు రహదారిలో పట్టపగలే గోపయ్య గారి ధాన్యం, బండ్లు ఎడ్లతో సహా దోచుకు పోయావని నీ మీద అభియోగం మోపడమైనది. నీ సమాధానం ఏమిటి?''

"అదంతా నిజమే ప్రభూ!"



"అయితే నువ్వు దొంగవని ఒప్పుకుంటున్నా వన్న మాట."

"లేదు ప్రభూ!"

"అదేమిటి? ధాన్యం, బండ్లు, ఎడ్లు దోచుకున్నానని ఒప్పుకున్నావు గదా!"

"సామాన్య ప్రజలను దోచుకుంటే దొంగ అవుతాడు. ఒక దొంగను మరొక దొంగ దోచుకుంటే అతను దొంగ ఎలా అవుతాడు ప్రభూ!"

"రవివర్మా! నీ మాటలు ఆశ్చర్యంగా వున్నాయే? ఎవరి గురించి నువ్వు మాట్లాడుతున్నావో తెలుసా? గోపయ్య కొండవీడులో ప్రముఖ వ్యాపారి. గౌరవనీయుడు. గుడులు, గోపురాలకు, దేవుడి ఉత్సవాలకు చందాలు ఇచ్చే పెద్దమనిషి. ఆయన్ని దొంగ అనడానికి నీకెంత ధైర్యం?" అన్నాడు రాజు కోపంగా.

"దొంగని దొంగ అనడానికి ధైర్యం ఎందుకు ప్రభూ! నేను అతని ధాన్యం దోచుకున్నానని దొంగ అన్నారు. గోపయ్య పగటి దొంగ. పట్టపగలే వ్యాపారం చాటున ప్రజలను ఘరానాగా దోచుకుంటున్న మోసగాడు" తీవ్రంగా ఆరోపించాడు రవివర్మ.

"నీ ఆరోపణలకు రుజువులు, సాక్ష్యాలు వున్నాయా?"

"మీరు విచారణ జరిపితే అన్నీ సిద్ధం చేస్తాను ప్రభూ! గోపయ్య వ్యాపారస్తుల సంఘానికి నాయకుడు. రైతుల దగ్గర్నుంచి ధాన్యం, అపరాలు చౌకగా కొని గిడ్డంగులలో అక్రమంగా దాచివుంచి కృత్రిమ కొరత సృష్టించి ఎన్నోరెట్లు ఎక్కువ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నారు. వ్యాపార లావాదేవీలన్నీ ప్రభుత్వానికి తెలియజేయకుండా కొందరు అవినీతి అధికారులకు లంచాలు ఇచ్చి పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నాడు. ఇంతే కాకుండా తూనికలు, కొలతల్లో గూడా మోసమే ప్రభూ! తను చేస్తున్న మోసాలు బైటకు రానీయకుండా సంఘంలో పెద్దమనిషిగా చెలామణీ అవడానికి గుళ్ళు, గోపురాలకు చందాలు ఇస్తూ, పాపం నుంచీ తప్పించుకున్నానని సంతృప్తి పడుతుంటాడు." రవివర్మ వ్యాపారస్తుల మోసాల గురించి వివరంగా చెప్పాడు.

"ఇప్పుడు చెప్పండి ప్రభూ! ఒక దొంగని మరొక దొంగ దోచుకుంటే అతన్ని దొంగ అంటారా?" అని అడిగాడు రవివర్మ.

"ఒక దొంగ మరొకర్ని దొంగ అనడానికి అర్హతలేదని ఒప్పుకుంటున్నాను" అన్నాడు మహారాజు.

అప్పటికప్పుడే గోపయ్య వ్యాపారాల మీద అధికారులతో దాడులు జరిపించి జరిగిన మోసాల్ని వెలికి తీయించాడు మహారాజు.

తను స్వతహా దొంగని కాదనీ జరుగుతున్న మోసాలు ప్రభువు దృష్టికి తీసుకురావడానికే గోపయ్యను దోచుకున్నట్లు నాటకం ఆడానని వివరించాడు రవివర్మ.

రవివర్మ తెలివి తేటలకు మెచ్చుకుని అతన్ని కొండవీడులో వాణిజ్య వ్యవహారాలు పర్యవేక్షించే అధికారిగా నియమించాడు మహారాజు.